సాక్షి
సూర్యాపేట
సోమవారం ; 2 ; సెప్టెంబర్ ; 2024



మూసీ ఐదుగేట్ల ఎత్తివేత

మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ఆదివారం ఐదు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 4,74,205 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 4,97,524 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 12,261 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 5,292 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: నిల్
ఏఎమ్మార్పీకి	: 1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	641.60 అడుగులు
ఇన్‌ఫ్లో	: 4,789 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: 12,222క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

నేడు విద్యా సంస్థలకు సెలవు

సూర్యాపేట: భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో సూర్యాపేట జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్లాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు విధిగా ఈ ఆదేశాలను పాటించాలని పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో విద్యా సంస్థలకు ముందస్తుగా సెలవు ప్రకటించామని తెలిపారు.

నేడు ప్రజావాణి రద్దు

సూర్యాపేట: అధిక వర్షాల కారణంగా సోమవారం(నేడు) జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు ఆదనపు కలెక్టర్ బీఎస్.లత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ సోమవారం ప్రజావాణికి ఎవరూ రావొద్దని పేర్కొన్నారు. వచ్చే వారం (9-9-2024) జరిగే ప్రజావాణి కార్యక్రమానికి రావాలని సూచించారు.

జిల్లా అంతటా కంట్రోల్ రూమ్‌లు

అర్వపల్లి: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అంతటా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్.లత చెప్పారు. భారీ వర్షాలకు అర్వపల్లిలో జలమయమైన లోతట్టు ప్రాంతాలు, కేజీబీవీని ఆదివారం ఆమె పరిశీలించారు. వివిధ శాఖల అధికారులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. కేజీబీవీ, సంతలలో నిలిచిన నీటిని చెరువులోకి వెళ్లేలా జేసీబీతో తవ్వకాలు జరిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు నీటి ప్రవాహాలకు అడ్డంగా కట్టడాలు కడితే ఇబ్బందులు తప్పవని చెప్పారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు రెండు రోజుల పాటు బయటి పనులకు వెళ్లవద్దని ఇళ్లలోనే ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డీవో ఆర్. వేణుమాధవరావు, డీఎస్పీ రవి, తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీఓ పవన్‌కుమార్, గిర్దావర్ పాటి వెంకట్ రెడ్డి, డీఈ పిచ్చయ్య, పంచాయతి కార్యదర్శి జ్యోతిరెడ్డి, బైరబోయిన మహరాజు, సైదులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సూర్యాపేట: జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో పంటలు నీట మునిగి, ఇళ్లు కూలిపోయి నష్టపోయిన రైతులు, ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు వెంటనే గ్రామాల్లో పర్యటించి జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ప్రజలను సహాయక కేంద్రాలకు తరలించి భోజన సౌకర్యం కల్పించాలన్నారు. ఇల్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించి, వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సీపీఎం నాయకులు, కార్యకర్తలు వరద సహాయక చర్యల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చెస్ పోటీల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న కృపాకర్

సూర్యాపేట: జిల్లాకు చెందిన బాలబాలికలు చెస్ పోటీల్లో రాణించాలని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్-09, 11, 15 బాలబాలికల చెస్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. చెస్ ఆడడం ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తిని పెరుగుతుందన్నారు. అండర్-15 బాలుర విభాగంలో మొదటి బహుమతి కె.అనిరుధ్ రాజు, రెండవ బహుమతి సాయికమల్, మూడో బహుమతి దీక్షిత్, బాలికలలో మొదటి బహుమతి రమ్య, రెండవ బహుమతి కుషాలి గెలుపొందారు. అండర్-11 బాలుర విభాగంలో మొదటి బహుమతి రక్షిత్, రెండవ బహుమతి కుషికృష్ణ, మూడవ బహుమతి దక్షిత్ గెలుపొందారు. బాలికల విభాగంలో మొదటి బహుమతి సహస్ర, రెండవ బహుమతి సాన్వి గెలుపొందారు. అండర్-09 బాలురలో మొదటి బహుమతి హయగ్రీవ మారుతి, రెండవ బహుమతి సాయి వర్షిత్ గెలుపొందారు. బాలికల్లో మొదటి బహుమతి సాయి కార్తీక, రెండవ బహుమతి భవిష్య గెలుపొందారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్, గండూరి శ్రీధర్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలోని జాతీయ రహదారిపై నిలిచిన వరదనీరు

ఎటు చూసినా వరదే..

కోదాడలో వరద ప్రవాహంలో కొట్టుకుపోయి ఇద్దరు మృతి

- హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో పలు చెరువులకు గండి
- నడిగూడెం మండలంలో రెండు చోట్ల తెగిన సాగర్ ఎడమ కాల్వకట్ట
- వేలాది ఎకరాల్లో నీటమునిగిన పంట పొలాలు
- వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు



నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద తెగిన సాగర్ ఎడమ కాల్వ కట్ట

సూర్యాపేట: జిల్లాలో వరుణుడు కొంత శాంతించాడు. అయితే ఎక్కడా చూసినా వరద ప్రవాహాలు పోటెత్తుతూ ప్రమాదకరంగా మారాయి. జిల్లాలో అల్పపీడన ప్రభావంతో రెండురోజుల పాటు అత్యంత నుంచి భారీ వర్షాలు పడ్డాయి. శుక్రవారం మధ్యాహ్నం మొదలైన వాన ఆదివారం ఉదయం 10 నుంచి 11గంటల వరకు ఏకధాటిగా కురిసింది. ఈ క్రమంలో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలే కాకుండా ప్రధాన రహదారులు, వీధులు జలమయంగా మారాయి. ఇళ్లల్లోకి నీరు చేరి ప్రజలు నానా అవస్థలు పడ్డారు. కోదాడ పట్టణంలో రోడ్డుపై వరదను దాటే ప్రయత్నంలో ఓ చోట కారు, మరోచోట బైక్ కొట్టుకుపోయాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో పలుచోట్ల చెరువులకు గండ్లుపడ్డాయి. ఇక జిల్లా అంతటా దాదాపుగా చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. కొన్నిచోట్ల ప్రమాదకరంగా అలుగులు పోస్తున్నాయి. ఈ నేపథ్యంలో కల్వర్టులు, లోలెవల్ బ్రిడ్జిల వద్ద వరద ప్రవాహం అధికంగా ఉండి వివిధ గ్రామాల మధ్య రాకపోకలు సైతం నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్, మఠంపల్లి, సూర్యాపేట, తొగర్రాయి, ఖమ్మం సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించి వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. అలాగే ఎస్పీ, అదనపు కలెక్టర్, ఏఎస్పీ పలు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

పలు మండలాల్లో మోస్తరు వర్షం

జిల్లాలోని మునగాల, ఆత్మకూర్ (ఎస్), తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల్లో ఆదివారం ఉదయం 8.30గంటల నుంచి రాత్రి 7గంటల వరకు మోస్తరు వర్షం పడింది. అలాగే జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, సూర్యాపేట, నాగారం, మోతె, అనంతగిరి, చివ్వెంల, నూతనకల్ మండలాల్లోనూ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 8.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

కోదాడలో వర్ష బీభత్సం

కోదాడలో శనివారం ఉదయం నుంచి రాత్రి 8గంటల వర్షం బీభత్సం సృష్టించింది. అధికారులు లెక్కల ప్రకారం పట్టణంలో 187 మి.మీ. వర్షపాతం నమోదైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కోదాడ పెద్ద చెరువులోకి భారీగా నీరు చేరడంతో దాని ఎఫ్‌టీఎల్‌లో, బఫర్‌జోన్‌లో నిర్మాణం చేసిన వందల ఇళ్లు, ఇతర భవనాలు నీటమునిగిపోయాయి. పెద్దచెరువు అలుగు పోస్తుండడంతో పలు కాలనీల్లోని ఇళ్లలలోకి చేరింది. వరద నీరు కోదాడ-ఖమ్మం రోడ్డుమీదుగా ప్రవహిస్తుండడంతో పోలీసులు రాకపోకలను నిలిపివేశారు. కోదాడలోని ఉలక వాగు వరద వల్ల శ్రీమన్నారాయణ కాలనీతో పాటు అజాద్ నగర్, మాతానగర్‌లు ముంపునకు గురయ్యాయి.



కోదాడలో వరదనీటిలో కొట్టుకొచ్చిన కార్లు

కోదాడలో ఉలకవాగు దాటుతూ ఉత్తం పద్మావతి నగర్ వద్ద ఇద్దరు చనిపోయారు.కోదాడ పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డు జలదిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో ఇటు ప్రజలు, అటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు ఆదివారం వరద ప్రాంతాలను సందర్శించి సహాయక చర్యలు చేపట్టారు.

ఎక్కడెక్కడ ఏం జరిగిందంటే..

- నడిగూడెం మండలం కాగితారామచంద్రపురం వద్ద సాగర్ ఎడమ కాల్వకు రెండు చోట్ల గండి పడింది. వందలాది ఎకరాల వరి పొలాలు నీటమునిగాయి.
- మఠంపల్లి మండలం చౌటపల్లి ఊరచెరువుకు గండిపడింది. మఠంపల్లిలో కప్పలవాగు పొంగిపొర్లడంతో ఎస్సీ కాలనీలోకి వరద చేరింది.
- తిరుమలగిరిలో భారీ వర్షం కారణంగా సూర్యాపేట-జనగాం ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది.
- మునగాల మండలం పాత ముకుందాపురంలోని తిప్పాయకుంట చెరువు కట్ట తెగడంతో గ్రామంలోకి వరద నీరు చేరింది.
- మోతె మండలం రావిపహాడ్ పెద్దచెరువు అలుగు వద్ద వరద నీటితో మాదాసు నరేష్ అనే యువకుడు చిక్కుకున్నాడు.
- ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలో భీమునికుంట అలుగుపోయడంతో పలు ఇళ్లలోకి వరద నీరు చేరింది. ఆత్మకూర్-నెమ్మికల్ రహదారి, సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై వరద ప్రవాహం కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాతర్లపహాడ్, కందగట్ల తదితర గ్రామాల్లో పలు కాలనీలు నీటమునిగాయి. ఏపూరు వద్ద బిక్కేరు వాగు బ్రిడ్జిపై నుంచి 3 ఫీట్ల మేర ఎత్తులో ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.
- హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలో చెరువు కట్ట తెగిపోయింది.
- మేళ్లచెరువులో నాగులచెరువు కట్ట తెగిపోయి పంట పొలాలన్ని నీట మునిగాయి. వెంకట్రామాపురం నుంచి బక్కమంతులగూడెం వెళ్లే రోడ్డు వరద ప్రవాహానికి కొట్టుకుపోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.
- సూర్యాపేట పట్టణంలో సుందరయ్య నగర్‌లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. పలు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి.
- సూర్యాపేట మండలం పిల్లలమర్రి-పిన్నాయిపాలెం మధ్య మూసీ ఎడమకాల్వకు గండిపడింది. సమీపంలోని పొలాలు మునిగిపోయాయి.
- పెన్‌పహాడ్ మండలం అనంతారం-పొట్లపహాడ్ మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి.
- చివ్వెంల మండల కేంద్రంలో పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

వాహనాల దారి మళ్లింపు

తెలంగాణ- ఆంధ్రా సరిహద్దు కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద పాలేరువాగు ఉధృతంగా ప్రవహిస్తుండడతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపైకి వరదనీరు వచ్చి చేరుకుంది. దీంతో అధికారులు హైదరాబాద్-విజయవాడ రహ దారిపై అధికారులు రాకపోకలను నిలిపివేశారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి వద్ద అద్దంకి రోడ్డు వైపు మళ్లించారు. అలాగే సూర్యాపేట నుంచి ఖమ్మం వెళ్లే మార్గంలో నాయకన్‌గూడెం వద్ద రోడ్డుపై పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు నిలిపివేశారు.

అధికారులంతా అందుబాటులో ఉండండి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



నడిగూడెం : తెగిన సాగర్ ఎడమ కాల్వ కట్ట వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

సూర్యాపేట, నడిగూడెం: వాతావరణ శాఖ వెల్లడించిన ప్రకారం రెండు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులంతా ప్రజలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. ఆదివారం అధిక వర్షాల నేపథ్యంలో జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్, మఠంపల్లి, సూర్యాపేట, తొగర్రాయి, ఖమ్మం సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించారు. అలాగే నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం పరిధిలో రెండుచోట్ల తెటిన సాగర్ ఎడమ కాలవ్వకట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నందున అన్ని శాఖలను అప్రమత్తం చేశామని, సమస్యల పరిష్కారానికి గ్రామ స్థాయి వరకు అధికారులను అందుబాటులో ఉంచామని చెప్పారు. వంతెనల వద్ద నీరు పారే సమయంలో ఎవరూ వెళ్లకుండా అధికారులు చూడాలన్నారు. జిల్లాస్థాయిలో పర్యవేక్షణకు 24గంటలు పర్యవేక్షిస్తూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 6281492368 నంబర్‌కు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు కూడా ఏదేని విపత్తు జరిగితే ఈ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. కంట్రోల్ రూమ్ కు వచ్చిన సమస్యపై స్పందిస్తున్నామని తెలిపారు. నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వ తెగిన చోట్లలో రైతులతో మాట్లాడారు. వారం రోజుల్లో రెండుచోట్ల తెగిన కాల్వకట్టను మరమ్మతులు చేయిస్తామన్నారు. కాల్వకట్ట తెగి వరద కారణంగా రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేస్తామన్నారు. వరద గ్రామం వైపు రాకుండా ప్రత్యేక చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓలు సూర్యనారాయణ, శ్రీనివాసులు, తహసీల్దార్లు, సిబ్బంది ఉన్నారు.

సురక్షిత ప్రాంతానికి 200 మంది బాలికలు



బాలికలను బయటకు తీసుకొస్తున్న జీసీడీఓ పూలన్, ఎంఈఓ తదితరులు

అర్వపల్లి: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల మూలంగా అర్వపల్లి శివారులోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం పూర్తిగా జలమయమైంది. దీంతో ఆదివారం జిల్లా అదనపు కలెక్టర్ లత పర్యవేక్షణలో జీసీడీఓ పూలన్, ఎంపీడీఓ పవన్‌కుమార్, తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంఈఓ బి.బాలునాయక్, ఎస్ఓ నాగరాణి, పంచాయతీ కార్యదర్శి జ్యోతిరెడ్డి కేజీబీవీని సందర్శించారు. విద్యాలయంలోని 200మంది బాలికలను వరద నీటిగుండా నడిపించుకుంటూ సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. వీరందరికి స్థానిక శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో వసతి కల్పించారు. ఆతర్వాత వారి తల్లిదండ్రులను పిలిపించి బాలికలను ఇళ్లకు పంపించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



జాతీయ రహదారిపై వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్: భారీ వర్షాల కారణంగా చెరువులు, వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. కోదాడ డివిజన్ పరిధిలో నడిగూడెం, కోదాడ రూరల్ పరిధి జాతీయ రహదారిపై నల్లబండగూడెం వద్ద వరద పరిస్థితులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సహాయక చర్యలు చేపట్టామన్నారు. వరద నీటి ఉధృతిని అంచనా వేయకుండా నదులు, కాలువలు, కుంటలు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. విద్యుత్ స్తంభాల సమీపంలోకి వెళ్లవద్దని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు, స్థానిక పోలీసులకు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్ 8712686026 ఫోన్ చేసి పోలీసు సాయాన్ని పొందవచ్చన్నారు. ఆయన వెంట ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు, కోదాడ రూరల్ ఇన్‌స్పెక్టర్ రజిత తదితరులు ఉన్నారు.

నల్లగొండ జిల్లాలో...



ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుబి వాగు

- నల్లగొండ జిల్లా కేతేపల్లిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో భారీ వర్షాలతో 9 చెట్లు నేలకూలాయి. అర్ధరాత్రి కావడంతో పిల్లలు ఎవరూ లేకపోవడం భారీ ప్రమాదం తప్పింది. 112 చెరువులు అలుగు పోస్తున్నాయి.
- నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు నుంచి శాలిగౌరారం వెళ్లేదారిలో కల్వర్టుపై నుంచి నీరు భారీగా రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- దేవరకొండ మండలం మునగనూర్ నుంచి చందంపేట వెళ్లే దారిలో వాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- నల్లగొండ జిల్లాలో భారీ వర్షాల కారణంగా 498 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

మూసీ కాలువకు గండి



కాలువకు గండి పడడంతో వృథాగా పోతున్న నీరు

సూర్యాపేట రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండల వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు నిండి అలుగులు పోస్తున్నాయి. మూసీ ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువ నీళ్లు విడుదల చేరడంతో పిల్లలమర్రి, పిన్నాయిపాలెం గ్రామాల మధ్య ఉన్న కాలువకు గండి పడింది. ఇరిగేషన్ శాఖ, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, డీఈ చంద్రశేఖర్, ఏఈ స్వప్నలు అక్కడికి చేరుకుని మరమ్మతులు చేయించారు. భారీ వర్షంతో కుసుమవారిగూడెం వద్ద ఉన్న వాగు పొంగి పొర్లడంతో భీమారం-మిర్యాలగూడ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాసరబాద వాగు ఉధృతంగా రావడంతో గ్రామంలోని ప్రజలు సూర్యాపేటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు.



చిలుకూరు మండలం నారాయణపురంలో తెగిన చెరువు కట్ట



సూర్యాపేటలో కాలువను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఆర్‌డీఆర్



కోదాడ-ఖమ్మం రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు



కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై చేరిన వరద నీరు

మిల్లర్ల సమస్యల పరిష్కారానికి సానుకూలం

- రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరెడ్డి



గోవిందరావును సన్మానిస్తున్న గణపతిరెడ్డి

సూర్యాపేట: రాష్ట్రంలోని రా రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అసోసియేషన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వానికి రైతులకు మధ్య వారధిగా ఉన్న రా రైస్‌మిల్లర్స్ ఈ వ్యవస్థను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కొండమీది గోవిందరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం గోవిందరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రభుత్వం వద్ద బకాయిలుగా ఉన్న మిల్లింగ్ చార్జీలు, డ్రై ఏజ్ చార్జీలు, ట్రాన్స్‌ఫోర్ట్ చార్జీలు, సోడియం చార్జీలను ప్రభుత్వం వెంటనే చెల్లించి ప్రభుత్వం మిల్లర్లకు అండగా నిలవాలన్నారు. తన ఎన్నికకు సహకరించిన సూర్యాపేట కోదాడ, తిరుమలగిరి, హుజూర్‌నగర్, గరిడేపల్లి ప్రాంతాల్లోని రా రైస్ మిల్లర్స్‌లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రా రైస్ మిల్లర్లు సుందరి నాగేశ్వర్‌రావు, అనుప్‌రెడ్డి, అర్వపల్లి సుధాకర్, నాగరాజు, గజ్జి వెంకటేశ్వర్లు, మట్టారెడ్డి, నరసింహారావు, పరమాత్ముల మధు, సైదులు, ఉపేందర్, వట్టె గణేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎలుకలు కరిచినా పట్టని ప్రభుత్వం



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

దేవరకొండ: గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులను ఎలుకలు కరిచినా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితుల్లో ఉందని మాజీ మంత్రులు హరీశ్‌రావు, మంత్రి గంగుల కమలాకర్, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, గురుకులాల మాజీ సెక్రటరీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ గురుకుల పాఠశాలను ఆదివారం వారు సందర్శించారు. మూడు రోజుల క్రితం పాఠశాల హాస్టల్‌లో నిద్రిస్తున్న 13 మంది విద్యార్థులపై ఎలుకలు దాడి చేయడంతో వారిని పరామర్శించి మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గురుకుల పాఠశాలలు, కళాశాల పరిస్థితిపై సమీక్షించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారి వెంట ఎంపీ రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గాదరి కిషోర్ ఉన్నారు.

క్లుప్తంగా

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

- ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఆరు నెలల కాలపరిమితి కలిగిన స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్), సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు ఐటీఐ లేదా ఇంటర్ పాసై ఉండాలని అన్నారు. అదేవిధంగా టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజీ క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుకు 8వ తరగతి విద్యార్హత కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పించబడుతుందని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. అభ్యర్థులు 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని, ఆసక్తి కలిగిన వారు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 8న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావాలని అన్నారు. మరిన్ని వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేటి పరీక్షలు వాయిదా

నల్లగొండ రూరల్: వర్షాల కారణంగా మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం జరగాల్సిన ఎంఈడీ, ఎల్ఎల్‌బీ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఉపేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన నేపథ్యంలో పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అయితే మంగళవారం నుంచి జరగాల్సిన పరీక్షలు యథాతథంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

భువనగిరి రూరల్: భువనగిరి మండలంలోని బండసోమారం గ్రామంలో ఆదివారం పిడుగుపాటుకు గురై ఆవు మృతిచెందింది. గ్రామానికి చెందిన రైతు నల్లమాస రాజు గౌడ్ వ్యవసాయ బావి వద్ద ఆవును కట్టివేశాడు. ఒక్కసారిగా పిడుగుపడడంతో ఆవు మృతిచెందింది. దాని విలువ సుమారు రూ.లక్షా20 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

సాగర్ ఎడమ కాలువలో పడి మహిళ మృతి

త్రిపురారం: నిడమనూరు మండలంలోని వేంపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం ఓ మహిళ ప్రమాదవశాత్తు నాగార్జునసాగర్ ఎడమ కాలువలో పడి మృతి చెందింది. నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణానికి చెందిన జిల్లెపల్లి రాములమ్మ గత ఆరు నెలల నుంచి వేంపాడులో తన బంధువుల వద్ద ఉంటోంది. ఆదివారం మిర్యాలగూడకు వెళ్లే సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వేంపాడు వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాలువలోకి దిగడంతో కాలు జారి అందులో పడింది. అదే సమయంలో చేపలు పడుతున్న స్థానికులు చూసి ఆమెను బయటకు తీసుకురాగా.. అప్పటికే ఆమె మృతి చెందింది. మృతురాలి కుమారుడు జిల్లెపల్లి వీరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.

తెగిన చెరువు కట్టలు.. రోడ్లు మునిగిన పంటలు

- పలు చోట్ల కూలిన ఇళ్లు
- భారీ వర్షంతో అతలాకుతలం
- కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట నియోజక వర్గాల్లో తీవ్ర నష్టం
- వరిపొలాల్లో ఇసుక మేటలు


కనగల్ మండలం బుడుమర్లపల్లి గ్రామంలో కూలిన ఇంటి గోడ


హుజూర్‌నగర్‌లోని 15వ వార్డులో ఇంట్లోకి వచ్చిన వరదనీరు


చిలుకూరు: నారాయణపురం - బిక్యాతండా రోడ్డులో విరిగిన విద్యుత్ స్తంభం


కోదాడ పట్టణంలోని సీసీరెడ్డి స్కూల్ వద్ద కొట్టుకువచ్చిన కారు


చిలుకూరు నుంచి దూదియాతండాకు వెళ్లే రహదారిలో రాయికుంట వద్ద తెగిన రోడ్డు


జలమయమైన అర్వపల్లి పశువైద్యశాల


సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మానసానగర్‌లో జలమయమైన రోడ్డు


హుజూర్‌నగర్: మఠంపల్లి రోడ్డులో వాగు నీటిలో చిక్కుకున్న లారీ


హుజూర్‌నగర్‌రూరల్: బూరుగడ్డలో తెగిన నల్లచెరువు కట్ట


నూతనకల్: మిర్యాలలో తెగిన ముత్యాలమ్మ కుంట చెరువు కట్ట


నడిగూడెం: రత్నపురం వద్ద చెరువును తలపిస్తున్న వరిపొలాలు


మేళ్లచెరువులోని నాగుల చెరువుకు పడిన గండి


మఠంపల్లి: రఘునాథపాలెం వద్ద వరద ఉధృతికి తెగిపోయిన రోడ్డు


మేళ్లచెరువు మండలం వెంకట్రామాపురం నుంచి బక్కమంతులగూడెం మధ్యలో వరద ధాటికి తెగిన రోడ్డు


అనంతగిరి: వెంకట్రాంపురం వద్ద వరద ప్రవాహం


కోదాడరూరల్: తొగర్రాయిలో కొట్టుకుపోయిన బ్రిడ్జి


తిరుమలగిరిలో సూర్యాపేట -జనగామ రహదారిపై నిలిచిన వర్షపు నీరు


జలమయమైన అర్వపల్లి కేజీబీవీ నుంచి పుస్తకాలు తలపై పెట్టుకుని బయటకు వస్తున్న విద్యార్థులు


హుజూర్‌నగర్ రూరల్: దెబ్బతిన్న బూరుగడ్డ - కరక్కాయలగూడెం రోడ్డు

ముగిసిన అంతర్జాతీయ టెన్నిస్ పోటీలు

భువనగిరి: భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో జరుగుతున్న అండర్–18 అంతర్జాతీయ టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు ఫైనల్ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ఫైనల్స్‌లో విజయ సాధించిన క్రీడాకారులు 60 పాయింట్లు సాధించి ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మెరుగుపడ్డారు. కాగా ఫైనల్స్ శనివారం జరగాల్సి ఉండగా వర్షం కారణంగా ఆదివారానికి వాయిదా వేశారు. ఆదివారం మధ్యాహ్నం వర్షం కొద్దిగా తెరిపినివ్వడంతో ఫైనల్స్ నిర్వహించారు. ఫైనల్స్‌లో బాలికల సింగిల్స్ విభాగంలో స్నిగ్ధ కాంత(ఇండియా), బాలురు విభాగంలో శంకర్ హిస్నమ్(ఇండియా), బాలికల డబుల్స్ విభాగంలో దియా రమేష్, సోహిని సంజయ్ మొహంతి(ఇండియా), బాలురు డబుల్స్ విభాగంలో సెహజ్ సింగ్ పవార్, వరుణ్ వర్మ(ఇండియా) విజయం సాధించారు. విజేతలకు సాయంత్రం షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి, ఐటీఎఫ్ సూపర్‌వైజర్ శివకుమార్‌రెడ్డి, సుభాస్‌రెడ్డి పాల్గొన్నారు.


విజేతలతో టెన్నిస్ అసోసియేషన్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

నేటి నుంచి వెటరన్ టోర్నమెంట్..

ఐటీఎఫ్ వెటరన్ టోర్నమెంట్ సోమవారం నుంచి ప్రారంభంకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 35 నుంచి 75 ఏళ్ల వయస్సు వరకు గల కేటగిరీల్లో స్త్రీ, పురుషలకు వేర్వేరుగా టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నారు. పలు దేశాలకు చెందిన సుమారు 70 క్రీడాకారులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మూసీ ఐదు గేట్ల ఎత్తివేత

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో అధికారులు ఆదివారం ఐదు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ గరిష్ఠ నీటిమట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా.. ప్రస్తుత నీటిమట్టం 641.60 అడుగుల (3.60 టీఎంసీలు) మేర ఉంది. ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువ నీటిని నిలిపివేశారు. ప్రాజెక్టులోకి 4,789 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. గేట్ల ద్వారా 12,222 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.


మూసీ ప్రాజెక్టు ఐదు గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

పులిచింతలకు 6.05 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు సాగర్, టెయిల్‌పాండ్‌ల నుంచి భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. శనివారం 3,39,434 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం 6,05,120 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టులోని 21 గేట్ల ద్వారా 5,63,451 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 41.98 టీఎంసీల నీరు ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరో ముగ్గురికి గాయాలు
- అమెరికా నుంచి వస్తున్న స్నేహితుడిని కలిసేందుకు వెళ్తుండగా ఘటన

సూర్యాపేటటౌన్: అమెరికా నుంచి వస్తున్న స్నేహితుడిని రిసీవ్ చేసుకునేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం అర్ధరాత్రి 1.30గంటల సమయంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఆత్మకూర్‌కు చెందిన కొరిక విజయభాస్కర్ కుమారుడు కొరిక అభిషేక్(21), అతడి మిత్రులు జీవన్, సాయికిరణ్, దుర్గాప్రసాద్(పండు) కలిసి తమ స్నేహితుడు అమెరికా నుంచి వస్తుండడంతో అతడిని రిసీవ్ చేసుకునేందుకు కారులో శనివారం రాత్రి హైదరాబాద్‌కు బయల్దేరారు. దుర్గాప్రసాద్ డ్రైవింగ్ చేస్తున్నాడు. మార్గమధ్యలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ సమీపంలో విజయవాడ -హైదరాబాద్ జాతీయ రహదారిపై బారికేడ్స్‌ను అతివేగంతో ఢీకొట్టడంతో అభిషేక్ తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. మిగతా ముగ్గురికి గాయాలయ్యాయి. మృతుడి తండ్రి విజయభాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

తెగిన నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కట్ట

నడిగూడెం: మండలంలోని కాగితరామచంద్రాపురం గ్రామ సమీపంలో సాగర్ ఎడమ కాల్వ కట్ట రెండు చోట్ల తెగింది. ఓ వైపు సాగర్ నీరు, మరో వైపు పాలేరు రిజర్వాయర్ నుంచి బ్యాక్‌వాటర్ ఉధృతంగా కాల్వలోకి రావడంతో కట్ట తెగింది. దీంతో వరద నీరు కాగితరామచంద్రాపురం, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మందడినర్సయ్యగూడెం, శీత్లతండా, ఈశ్వరమాదారం, నడిగూడెం మండలం వల్లాపురం, అనంతగిరి మండలం చనుపల్లి, పాలారం, కిష్టాపురం, శాంతినగర్ గ్రామాల పరిధిలోని పాలేరు వాగు వెంట ఉన్న దాదాపు 500 ఎకరాలకు పైగా వరి పొలాలు, 200లకు పైగా విద్యుత్ మోటార్లు నీట మునిగాయి. సూర్యాపేట, ఖమ్మం జిల్లాల సరిహద్దు అయిన కాగితరామచంద్రాపురం, మందనర్సయ్యగూడెం గ్రామాల మధ్య వరద ఉధృతి కొనసాగుతుండడంతో రాకపోకలు నిలిచాయి. లోతట్టు గ్రామాల ప్రజలను పోలీసులు అప్రమత్తం చేశారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సంబంధిత అధికారులతో మాట్లాడి సంఘటనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాల్వకట్ట తెగిన ప్రాంతాన్ని ఎస్పీతోపాటు మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ ఇమామ్, ఎస్ఐ అజయ్ కుమార్, ఎంపీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డి పరిశీలించారు.

ఉలక వాగులో కొట్టుకుపోయి ఇద్దరు మృతి

కోదాడ: భారీ వర్షాలకు కోదాడ పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉలక వాగులో కొట్టుకుపోయి మృతిచెందారు. కోదాడ పట్టణంలోని ఉత్తమ్ పద్మావతినగర్‌కు చెందిన యరమాల వెంకటేశ్వర్లు (53) శనివారం రాత్రి స్థానికంగా ప్రవహిస్తున్న ఉలక వాగును దాటుతుండగా వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. ఆదివారం ఉదయం అతడి మృతదేహాన్ని అధికారులు, బంధువులు సమీపంలో గుర్తించారు. అదేవిధంగా కోదాడ పట్టణంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన నాగం రవికుమార్ ఉలక వాగును కారులో దాటుతుండగా కారుతో పాటు గల్లంతయ్యాడు. ఉదయం వాగులో నుంచి కారును బయటకు తీస్తుండగా రవికుమార్ కారులోనే మృతిచెంది ఉన్నాడు. ఇరువురి మృతదేహాలను కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.


కారులోనే మృతి చెందిన నాగం రవికుమార్


యరమాల వెంకటేశ్వర్లు (ఫైల్)

నీటి ప్రవాహంలో చిక్కుకున్న ఆరుగురు

- జాలర్ల సాయంతో కాపాడిన పోలీసులు

కోదాడ: పాలేరు నీటి ప్రవాహంలో చిక్కుకున్న ఆరుగురిని కోదాడ డివిజన్ పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి కాపాడారు. ఆదివారం రాత్రి పాలేరు నదికి వరద ఉధృతి పెరగడంతో కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం వద్ద ఉన్న కోళ్ల ఫారంలోకి వరద నీరు చేరింది. అక్కడ పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని గుడివాడకు చెందిన ఇద్దరు పురుషులు, ఇద్దరు స్త్రీలు, మరో ఇద్దరు పిల్లలు వరద నీటిలో చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న సూర్యాపేట ఏఎస్పీ నాగేశ్వరరావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, రూరల్ సీఐ రజితారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, ఎస్ఐ అనిల్‌రెడ్డి అక్కడి చేరుకున్నారు. కోదాడ పెద్దచెరువు సంఘం అధ్యక్షుడు కందరబోయిన వీరస్వామి ద్వారా ఇద్దరు జాలర్లను, తెప్పలను తెప్పించి కోళ్లఫారం వద్దకు పంపించి అక్కడ ఉన్న కూలీలు వారి పిల్లలు నలబాపన శ్రీను, రమాదేవి, హరిత, వినీల, వాస్తవ్య, పోతర్ల శ్రీనివాస్‌లను సురక్షితంగా బయటకు తీసుకువచ్చి కోదాడలోని పునరావాస కేంద్రానికి పంపించారు.


బాధితులతో ఏఎస్పీ, డీఎస్పీ, సీఐ, పోలీస్ సిబ్బంది